క్లుప్తంగా

బస్తీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ గార్డెన్ బస్తీ నూతన సంక్షేమ సంఘం సభ్యులు మంగళవారం బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కె.ఎం. ప్రతాప్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపిన ప్రతాప్ బస్తీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అధ్యక్షుడు ఉప్పల హరి వేణుగోపాల్, ఉపాధ్యక్షులు శ్రీరామ్, శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్, సంయుక్త కార్యదర్శులు సురేష్, కృష్ణారావు, కన్నప్ప, కార్యదర్శులు రాజేష్, ప్రవీణ్ కుమార్, హరిబాబు, కోశాధికారి భరత్, ముఖ్య సలహాదారులు నర్సింగ్ రావు, ప్రకాష్, సత్యనారాయణ, కేవీఎస్ఎస్ రాజు, ఉమామహేశ్వర్, సలహాదారులు పోచయ్య, హనుమంతరావు, అప్పిరెడ్డి, వెంకటరెడ్డి, కృష్ణంరాజు, నారాయణ, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

లీకేజీకి మరమ్మతులు



మరమ్మతు పనులను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

చింతల్: గాజులరామారం డివిజన్ పరిధిలోని వీఎస్ఆర్ టవర్ ఎదురుగా ఉన్న హెచ్‌పీ పెట్రోల్ బంక్ సమీపంలో గోదావరి జలాల పైపులైన్‌కు లీకేజీ ఏర్పడటంతో తాగునీరు రోడ్డుపై వృథాగా పోయింది. ఈ విషయాన్ని గుర్తించిన కాంగ్రెస్ నాయకుడు సిద్దనోళ్ల సంజీవరెడ్డి జలమండలి ఏఈ రోహిణికి ఫోన్ ద్వారా సమాచారం అందించారు. దీనిపై స్పందించిన అధికారులు లీకేజీకి మరమ్ముతుల చేపట్టారు. మంగళవారం లీకేజీ ప్రాంతాన్ని సందర్శించిన కాంగ్రెస్ నాయకులు తాగునీటి వృధాకు అడ్డుకట్ట వేసిన అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

మేయర్ నీలారెడ్డికి ఆహ్వానం



నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ స్వతంత్ర కార్పొరేటర్ శ్రీరాములు ఆధ్వర్యంలో మంగళవారం కందుల కూచిపూడి నాట్యాలయ అకాడమీ సభ్యులు మేయర్ నీలారెడ్డిని మర్యాపూర్వకంగా కలిశారు. జులై 15న కూచిపూడి నాట్యాలయం అకాడమీ 10వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని రవీంద్రభారతిలో నిర్వహించనున్న వేడుకలకు రావాలన్నారు. ఈ సందర్భంగా అకాడమీ నిర్వాహకుడు రవి కుచిపూడి ఆహ్వాన పత్రికను అందజేశారు. నాట్యాలయం సభ్యులు, ఇతర ముఖ్యులు ఉన్నారు.

త్యాగానికి ప్రతీకగా బక్రీద్



హజ్రత్ సయ్యద్‌షాహీ దర్గాలో ప్రార్థనలు చేస్తున్న భూపతిరెడ్డి

సుభాష్‌నగర్: బక్రీద్ పండుగ త్యాగాలకు ప్రతీకగా నిలుస్తుందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి అన్నారు. మంగళవారం గాజులరామారం డివిజన్‌లోని హజ్రత్ సయ్యద్‌షాహీ అలీబాబా దర్గాలో చాదర్ సమర్పించి ఆయన ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఇమామ్, మౌజాలకు బక్రీద్ తోఫాలు అందజేశారు. టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి బాస వేణుగోపాల్‌యాదవ్, కొంపల్లి మున్సిపాలిటీ అధ్యక్షుడు ప్రశాంత్ గౌడ్, మైనారిటీ సెల్ అధ్యక్షుడు చాంద్ పాషా, రాష్ట్ర మైనారిటీ సెల్ జాయింట్ కో.ఆర్డినేటర్ సమీర్ ఖాన్, మైనారిటీ సెల్ నాయకులు ఖాజాభాయ్, అల్తాఫ్, రియాజ్, మజీద్ తదితరులు ఉన్నారు.

కాలనీల్లో పర్యటిస్తూ.. సమస్యలు తెలుసుకుంటూ..

కుత్బుల్లాపూర్: ప్రజా సమస్యలు పరిష్కారం కావాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి అన్నారు. మంగళవారం జీడిమెట్ల డివిజన్ పరిధిలోని కుత్బుల్లాపూర్ గ్రామంలో పర్యటించిన ఆయన స్థానికంగా నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ ఏ-బ్లాక్ అధ్యక్షుడు బండి శ్రీనివాస్‌గౌడ్, కుత్బుల్లాపూర్ మండల మాజీ అధ్యక్షుడు బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి, కుత్బుల్లాపూర్ మైనారిటీ సెల్ చైర్మన్ చాంద్‌పాషా, బౌరంపెట్ మాజీ సర్పంచ్ మిద్దెల యాదిరెడ్డి, 129 డివిజన్ అధ్యక్షులు నీలి రహ్మతుల్ల, మక్బూల్, జిల్లా మహిళా కాంగ్రెస్ సెక్రటరీ భవాని, 132 డివిజన్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నాగలక్ష్మి, ఏఐసీసీ హ్యూమన్ రైట్స్ యువజన అధ్యక్షుడు ఇరుగు రాధకృష్ణ, జంగారెడ్డి, కుమార్ పూర్ణచందర్, దుబాయ్ మల్లారెడ్డి తదితరులు ఉన్నారు.

చెత్తాచెదారం.. తొలగించడంలో నిదానం



షాపూర్‌నగర్ రైతు బజారు వద్ద డంపర్ బిన్‌ల వద్ద పేరుకుపోయిన వ్యర్థాలు



గిరినగర్‌కు వెళ్లే రోడ్డులో చెత్తలో ప్లాస్టిక్‌ను ఏరుతున్న వ్యక్తి.. మరో వైపు ఆహార పదార్థాల వ్యర్థాలను తింటున్న పశువులు

రంగారెడ్డినగర్: రోజుల తరబడి పేరుకుపోతున్న వ్యర్థాలతో ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదం ఉంది. కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలో పోగువుతున్న ఇళ్ల వ్యర్థాలను తరలించేందుకు ప్రతిఏటా కోట్లాది నిధులు వెచ్చిస్తున్నా ఫలితం ఉండటం లేదు. ప్రధాన రోడ్లు మొదలుకుని గల్లీ రోడ్ల వెంబడి చెత్త పేరుకుపోతోంది. ఈ వ్యర్థాల్లో ప్లాస్టిక్ సైతం ఉండటంతో ఆహార పదార్థాలను తినే క్రమంలో పశువులు వాటిని సైతం భుజిస్తు ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నాయి.

◆ జంట సర్కిళ్ల పరిధిలో ప్రతిరోజు 350 టన్నుల పైచీలుకు ఇళ్ల వ్యర్థాలు వెలువడుతున్నాయి. వాటిని తరలించేందుకు 800 మంది పారిశుద్ధ్య సిబ్బంది, వారిపై పర్యవేక్షణకు 40 మందికిపైగా సూపర్‌వైజర్లు, ఇద్దరు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ అధికారి ఉన్నా ఎక్కడి చెత్త అక్కడే అన్న చందంగా మారుతోంది. స్వచ్ఛ హైదరాబాద్ అటుంచి ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో చెత్త కంపు కొడుతూ తీవ్ర దుర్గంధం వెదజల్లుతోందని, ప్రతిరోజు చెత్తను తరలించే ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



మాణిక్యనగర్ నాలా కల్వర్ట్ వద్ద చెత్తాచెదారం



ఏపీహెచ్‌బీ కాలనీలో ప్లాస్టిక్ వ్యర్థాలను తింటున్న పశువులు



జగద్గిరిగుట్ట-హెచ్‌ఎంటీ పైపులైన్ రోడ్డులో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు



షాపూర్‌నగర్ రైతు బజారు వద్ద పారిశుద్ధ్య సిబ్బంది చెత్తను డంప్ చేస్తూ..



షాపూర్‌నగర్ సాగర్ హోటల్ ఎదురుగా..

కుత్బుల్లాపూర్ డివిజన్ అభివృద్ధికి నోచుకోవడం లేదు

మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: బాబాయ్, అబ్బాయిల పాలనలో కుత్బుల్లాపూర్ డివిజన్ అభివృద్ధికి నోచుకోవడం లేదని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నేత కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. కుత్బుల్లాపూర్ గోస - శ్రీశైలం అన్న భరోసా కార్యక్రమంలో భాగంగా మంగళవారం కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధిలోని శ్రీరామ్‌నగర్, బాపునగర్, బాపునగర్ వీకర్ సెక్షన్‌కాలనీ, సంజీవయ్యనగర్ బస్తీల్లో పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా స్థానికంగా నెలకొన్న సీసీ రోడ్లు, డ్రైనేజీ సమస్యలను స్థానికులు ఆయన దృష్టికి తీసుకురాగా పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

◆ అనంతరం శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణలో కేసీఆర్ అరాచక పాలన అంతానికి కౌంట్‌డౌన్ మొదలైందన్నారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కుత్బుల్లాపూర్‌లో సమస్యలు తాండవిస్తున్నా ఎమ్మెల్యే, కార్పొరేటర్లకు కనబడటం లేదని ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. బీజేపీ డివిజన్ అధ్యక్షుడు రాజేశ్వర్‌రావు, డివిజన్ ఇన్‌చార్జ్ బిల్లా వెంకటేష్, నాయకులు నటరాజ్ గౌడ్, శ్రీధర్‌వర్మ, దయాకర్, విజయ్‌గుప్తా, నందకిషోర్, శ్రీధర్, లింగంయాదవ్, సత్యం, ప్రవీణ్, గంజి శ్రీనివాస్, కిరణ్‌యాదవ్ విజయ్ కుమార్‌రాయ్, వీరేందర్‌గుప్తా, కృష్ణగుప్తా, జానయ్య, రవిగౌడ్, భూషణంగౌడ్, శ్రీధర్, విజయ్ కుమార్, స్వాతిరెడ్డి తదితరులు ఉన్నారు.



బాపునగర్‌లో పర్యటిస్తున్న కూన శ్రీశైలంగౌడ్

11మంది జూదరుల అరెస్టు

సుభాష్‌నగర్: పేకాడుతున్న 11 మందిని మేడ్చల్ ఎస్‌ఓటీ పోలీసులు అదుపులోకి తీసుకున్న ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సూరారం సీఐ వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. సూరారం కట్ట మైసమ్మ ఆలయం వెనకాల కొన్ని రోజులుగా గుట్టుచప్పుడు కాకుండా పేకాడుతున్నట్లు సమాచారం రావడంతో ఎస్‌ఓటీ పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. 11 మంది రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి తొమ్మిది మొబైల్ ఫోన్లు, రూ.52,840 నగదు స్వాధీనం చేసుకున్నారు. పేకాటరాయుళ్లను సూరారం పోలీసులకు అప్పగించగా వారిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జులై 2న లలిత సహస్రనామా పారాయణం

సుభాష్‌నగర్: సూరారం కాలనీలోని జైసంతోషినగర్ శివాలయంలో జులై 2వ తేదీన లలిత సహస్రనామా పారాయణం ఉంటుందని శ్రీగాయత్రి బ్రాహ్మణ మహిళా సేవా సంఘం నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలియజేశారు. లలితా సహస్ర నామాల పారాయణ అనంతరం మధ్యాహ్నం అన్నధానం, రాత్రి శ్రీవెంకటేశ్వస్వామి, అమ్మవారి కథలు, రాత్రంతా జాగారం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా పలు సంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. రాత్రి అమ్మవారి కథ చెప్పే సమయంలో నిప్పుల గుండం కార్యక్రమం ఉంటుందని, ఇందులో పాల్గొనేదలిచిన వారు ఎలాంటి ఆహారం, పానీయాలు తీసుకోకుండా రావాల్సి ఉంటుందన్నారు.

జీడిమెట్ల డీఐగా సూర్యనాయక్



జీడిమెట్ల: జీడిమెట్ల డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా సూర్యనాయక్ బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జోగులాంబ జిల్లా అలంపూర్ పీఎస్ నుంచి ఆయన బదిలీపై జీడిమెట్ల పోలీస్‌స్టేషన్‌కు డీఐగా చార్జ్ తీసుకుని బాధ్యతలు చేపట్టారు. ఆయన సాక్షితో మాట్లాడుతూ నేరాల నియంత్రనలో బాధ్యతగా వ్యవహరిస్తానని అన్నారు. రాత్రిపూట పెట్రోలింగ్ నిర్వహించి కాలనీలో దొంగతనాలు జరగకుండా చర్యలు తీసుకుంటానని తెలిపారు. ప్రజలు సైతం పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.

అబద్ధాలాడుతున్న ఎమ్మెల్యే బహిరంగ చర్చకు రావాలి

● బీజేపీ రాష్ట్ర నేత కూన శ్రీశైలంగౌడ్



కుత్బుల్లాపూర్: రెవెన్యూ సమస్యలను పరిష్కరించే విషయంలో అబద్ధాలు ఆడుతున్న ఎమ్మెల్యే బహిరంగ చర్చకు రావాలని.. లేకుంటే నియోజకవర్గ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నేత కూన శ్రీశైలంగౌడ్ సవాల్ విసిరారు. మంగళవారం గాజులరామారంలోని బీజేపీ అసెంబ్లీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... చెన్నకేశవనగర్, మల్లారెడ్డినగర్, మహాదేవ పురం కాలనీల్లోని సర్వే నం.329/2 నుంచి 329/10 వరకు తాను ఎమ్మెల్యేగా ఉన్నపుడు ఇంటి నిర్మాణాలకు అనుమతి, ఎల్ఆర్ఎస్‌లు ఇప్పించామన్నారు. అయితే 2014లో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచిపై సర్వే నంబర్లను ప్రొహిబిషన్ లిస్ట్‌లో పెట్టారని అన్నారు. రెండు సార్లు ఎమ్మెల్యేగా వివేకానంద్‌కు ప్రజలు పట్టం కడితే ఈ సర్వే నంబర్లలో నెలకొన్న రెవెన్యూ సమస్యలను ఎందుకు పరిష్కరించడం లేదని ప్రశ్నించారు.

◆ ధరణి పోర్టల్‌లో సైతం ఈ సర్వే నంబర్లను ప్రైవేట్ భూమిగా చూపించడం లేదన్నారు. ప్రైవేట్ వ్యక్తుల భూములను ప్రభుత్వ భూములుగా మార్చడం.. ప్రభుత్వ భూములను ప్రయివేట్ వ్యక్తులకు అమ్ముకోవడం ఎమ్మెల్యే వివేకానంద్‌కు పరిపాటిగా మారిందని ఎద్దేవా చేశారు. పై సర్వే నంబర్లలో అన్నపూర్ణమ్మ ఆలయంతో పాటు 40 నిర్మాణాలను 2016లోనే అధికారులులో కూల్చేశారని తెలిపారు. కానీ ప్రభుత్వ భూముల్లో కబ్జాలు, నిర్మాణాలు యథేచ్ఛగా జరుగుతుంటే మాత్రం అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పై సర్వే నంబర్‌లలో భువనేశ్వర్‌రెడ్డి అనే వ్యక్తి 300 గజాల తన ప్లాటులో తన సొంత ఖర్చులతో కోర్టుల చుట్టూ తిరిగి, చివరికి కోర్టు ఉత్తర్వులు ద్వారా అనుమతి తెచ్చుకున్నాడని పేర్కొన్నారు.

◆ ప్రగతి యాత్ర పేరిట పై కాలనీల్లో తిరిగిన ఎమ్మెల్యే వివేకానంద్ కు ఈ సమస్యలు కనబడలేదా అని ప్రశ్నించారు. కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కనీసం గెజిట్ నోటిఫికేషన్ ఇప్పించలేదని, పచ్చి అబద్ధాలు మాట్లాడుతూ... సర్వే నంబర్ 329/2 నుంచి 329/10 వరకు గల భూముల్లో నిర్మాణాలకు అనుమతులు ఇప్పించానని చెప్పుకుంటున్నాడని ఎమ్మెల్యే వివేకానంద్‌పై మండిపడ్డారు. ఎమ్మెల్యే వివేకానంద్‌కు సిగ్గుంటే పై సర్వే నంబర్లలో నెలకొన్న సమస్యలపై మహాదేవపురంలో చర్చకు సిద్ధమా అని మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్ సవాల్ విసిరారు.

కన్‌స్ట్రక్షన్ కంపెనీలు కార్మిక చట్టాలను పాటించాలి



నిర్మాణం జరుగుతునన ఓ ప్రాంతంలో వివరాలు తెలుసుకుంటున్న శ్రీనివాస్ నాయుడు, అధికారులు

నిజాంపేట్: నిర్మాణ పనులు చేస్తున్న కన్‌స్ట్రక్షన్ కంపెనీలు కార్మిక చట్టాలను తూచా తప్పకుండా పాటించాలని, అదే విధంగా నిబంధనల ప్రకారం పర్సంటేజీ సెస్‌ను చెల్లించాలని... లేని పక్షంలో కేసులు నమోదు చేయాల్సి వస్తుందని సెంట్రల్ బిల్డింగ్, అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ అడ్వైజర్ బోర్డ్ చైర్మన్ శ్రీనివాస్ నాయుడు అన్నారు. నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో మెర్లిన్ కన్‌స్ట్రక్షన్స్, వాసవీ కన్‌స్ట్రక్షన్స్, ఏపీఆర్ ప్రాజెక్ట్, ప్రణీత్ సోలి సైటల్ కన్‌స్ట్రక్షన్లు జరుగుతున్న ప్రాంతాలను ఆయన మంగళవారం మేడ్చల్ జిల్లా లేబర్ అధికారులతో కలిసి సందర్శించారు.

◆ ఈ సందర్భంగా కార్మికుల భద్రత, వసతిలకు తీసుకుంటున్న చర్యలు, కంపెనీలు చెల్లించాల్సిన సెస్, ఇంటర్ స్టేట్ మైగ్రేషన్ సర్టిఫికెట్, లేబర్ పర్మిషన్ సర్టిఫికెట్స్, నిర్మాణానికి సంబంధించి ఇతర నియమ నిబంధన పరిశీలించారు. ఈ సందర్భంగా లేబర్ నిబంధనలు పాటించని కన్‌స్ట్రక్షన్స్ యాజమాన్యాలకు నోటీసులు ఇవ్వాలన్నారు. కార్మికుల భద్రతకు చర్యలు చేపట్టిన కంపెనీలపై కఠిన చర్యలు తప్పవని శ్రీనివాస్ నాయకుడు పేర్కొన్నారు. లేబర్ అధికారులు శ్రీనివాసరావు, సాయిరెడ్డి, బీజేపీ నిజాంపేట్ కార్పొరేషన్ అధ్యక్షుడు ఆకుల సతీష్ తదితరులు ఉన్నారు.

వర్షాకాలంలో ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి

● దుండిగల్ చైర్‌పర్సన్ కృష్ణవేణి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న చైర్ పర్సన్ కృష్ణవేణి

దుండిగల్: వర్షకాలం నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని దుండిగల్ మున్సిపల్ చైర్ పర్సన్ కృష్ణవేణి అన్నారు. గండిమైసమ్మలోని మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం పలు అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. మున్సిపల్ పరిధిలోని ప్రధాన సమస్యలు, దీర్ఘకాలికంగా పరిష్కారం కానీ సమస్యల గురించి చర్చించారు.

- వర్ష కాలం నేపథ్యంలో అసంపూర్తిగా ఉన్న మ్యాన్‌హోల్స్, వీధి లైట్లు, వాకింగ్ ట్రాక్స్, డ్రైనేజీ, రోడ్లు, ఫాగింగ్ తదితర పెండింగ్ పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వర్షాలతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేసి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.

◆ మున్సిపల్ పరిధిలోని ప్రధాన కూడళ్ల వద్ద ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించాలని ట్రాఫిక్ సీఐ వెంకట్‌రెడ్డిని కోరారు. రానున్న బోనాల పండుగకు ఆలయాల్లో పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ, వైస్ చైర్మన్ పద్మారావు, కౌన్సిలర్లు శంభీపూర్ క్రిష్ణ, జక్కుల కృష్ణయాదవ్, అమరం గోపాల్ రెడ్డి, ఆనంద్ కుమార్, ఏల్లుగారి సత్యనారాయణ, భరత్ కుమార్, మహేందర్ యాదవ్, సాయి యాదవ్, శంకర్ నాయక్, మేనేజర్ సునంద, ఏఈ ప్రవీణ్‌కుమార్, ఆర్ఓ శ్రీహరి రాజు పాల్గొన్నారు.

బీజేపీ విజయానికి బూత్‌స్థాయి కార్యకర్తలే కీలకం



మేరా బూత్ సబ్‌సే మజ్బూత్ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న బీజేపీ నాయకులు

కుత్బుల్లాపూర్: ప్రధాని నరేంద్రమోదీ మంగళవారం నిర్వహించిన మేరా బూత్ సబ్‌సే మజ్బూత్ సమ్మేళనాన్ని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ నాయకులు మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్. మల్లారెడ్డితో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ బీజేపీ విజయాలకు బూత్ స్థాయి కార్యకర్తలే కారకులన్నారు. వచ్చే ఎన్నికల్లో కేంద్ర, రాష్ట్రాల్లో అత్యధిక మెజార్టీతో పార్టీని గెలిపించబోతున్నారని ప్రధాని పేర్కొనట్లు తెలిపారు. ఈ రాష్ట్ర నాయకులు నందనం దివాకర్, ఎంఎస్ వాసు, డివిజన్ల అధ్యక్షులు కంది శ్రీరాములు, పులి బలరామ్, పత్తి సతీష్, హనుమాన్ కచ్‌వాహ, బానుచందర్ ఉన్నారు.

బడిబాటకు అనూహ్య స్పందన

సర్కారు బడిలో చేర్పించేందుకు తల్లిదండ్రుల ఆసక్తి

- 407 ప్రభుత్వ పాఠశాలల్లో 9,037 మంది విద్యార్థుల చేరిక
- ప్రైవేట్ నుంచి ప్రభుత్వ పాఠశాలల్లోకి 4,691 మంది..
- వచ్చేనెల 6 వరకు బడిబాట కార్యక్రమం పొడిగింపు
- కరోనా నేర్పిన కష్టకాలంతో మారిన తల్లిదండ్రుల వైఖరి
- ప్రభుత్వ బడుల్లో అన్ని సౌకర్యాలు ఉండటంతోనే..



సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రభుత్వ పాఠశాలలకు ఆదరణ పెరుగుతోంది. కరోనా కష్టకాలం నుంచి పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన తల్లిదండ్రుల ఆలోచనా విధానంలో మార్పు వచ్చింది. ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఫీజులు చెల్లించడం తల్లిదండ్రులకు తలకు మించిన భారం కావడంతో ప్రభుత్వ పాఠశాల వైపు మొగ్గు చూపుతున్నారు. దీనికి మించి ప్రభుత్వ బడుల అభివృద్ధి కోసం తెలంగాణ సర్కారు తీసుకుంటున్న చర్యలు కూడా విద్యార్థుల తల్లిదండ్రుల చూపు ప్రభుత్వ పాఠశాలల వైపు వెళ్లేలా చేస్తోంది. అందులో భాగంగానే సర్కారు బడులకు గతంలో ఎన్నడూ లేని విధంగా ఆదరణ లభిస్తోంది. కోవిడ్-19 వైరస్ సృష్టించిన ఆర్థిక ఇబ్బందులు, నేర్పిన పాఠాలు పేద, మధ్యతరగతి కుటుంబాల తల్లిదండ్రుల్లో పెను మార్పు తీసుకువచ్చినట్లు తెలుస్తోంది. పైగా ప్రైవేట్ స్కూళ్లు ముఖ్యంగా కార్పొరేట్ పాఠశాలల్లో ఏడాదికి ఏడాది పెంచుతున్న అధిక ఫీజులను కూడా చెల్లించలేక చాలా మంది తల్లిదండ్రులు మారిన పరిస్థితుల్లో ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పిస్తున్నారు.

రికార్డు స్థాయిలో చేరికలు..

మేడ్చల్-మల్కాజిగిరిలో బడిబాట కార్యక్రమానికి అనూహ్య స్పందన లభిస్తోంది. ఈ నెల 3 నుంచి 9 వరకు ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల(విద్యార్థుల) పేర్ల నమోదు కార్యక్రమాన్ని చేపట్టిన విద్యాశాఖ 12 నుంచి 19వతేదీ వరకు బడిబాట కార్యక్రమాన్ని విద్యాశాఖ ఆర్భాటంగా, పెద్దఎత్తున చేపట్టింది. దీంతో బడిబాట కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది. ఈ నేపథ్యంలోనే బడిబాటను వచ్చే నెల 6వ తేదీ వరకు పాఠశాల విద్యాశాఖ పొడిగించింది. జిల్లా విద్యాశాఖ నిర్వహించిన బడి బాట కార్యక్రమంలో ఇప్పటి వరకు మేడ్చల్ జిల్లాలో 9,037 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరారు. ఇందులో ప్రైవేట్ స్కూళ్ల నుంచి 4,691 మంది విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో చేరడం రికార్డుగా జిల్లా విద్యాశాఖ పేర్కొంటోంది.

ప్రభుత్వ బడులపై ఆదరణ పెరిగిందిలా..

మేడ్చల్ జిల్లాలో విద్యార్థుల తల్లిదండ్రుల అభిప్రాయాలకు తగ్గట్టుగా అన్ని స్కూళ్లలో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టారు. అలాగే.. మనబడి-మన ఊరు-మన బస్తీ కార్యక్రమం కింద మొదటి విడతలో 176 ప్రభుత్వ బడుల్లో రూ.70 కోట్లతో మరమ్మతులు, మౌలిక వసతుల కల్పన వంటి చర్యలకు శ్రీకారం చుట్టారు. ఇప్పటి వరకు 35 పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దారు. ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుతుండటంతో పాటు విద్యార్థులకు ఏకరూప దుస్తులు, ఉచిత పుస్తకాల పంపిణీ, మధ్యాహ్న భోజన పథకం వంటి సదుపాయాలను కల్పిస్తున్న అంశాలను బడిబాటలో జిల్లా విద్యాశాఖ విస్తృతంగా ప్రచారం చేస్తోంది. ఫలితంగా బడిబాటకు అనూహ్య స్పందన లభిస్తోంది.

కరోనా నేర్పిన కష్టకాలం నుంచి..

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో కరోనా కష్టకాలంలో భాగంగా 2021-22 విద్యాసంవత్సరంలో 515 ప్రభుత్వ పాఠశాలల్లో 9,718 మంది విద్యార్థులు చేరగా, ఇందులో ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు 3,408 మంది ఉన్నారు. అలాగే.. 2022-23లో జిల్లాలో కొత్తగా ప్రభుత్వ పాఠశాలల్లో 793 మంది విద్యార్థులు చేరగా, ఇందులో ప్రైవేట్ విద్యా సంస్థల నుంచి వచ్చి చేరిన విద్యార్థులు 339 మంది ఉన్నారు.

మండలాల వారీగా ఇలా..

జిల్లాలో ప్రైవేట్ పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో మొత్తంగా 4,691 మంది విద్యార్థులు చేరగా, ఇందులో మండలాల వారీగా చేరిన విద్యార్థుల సంఖ్య ఈ విధంగా ఉంది. మేడ్చల్ మండలంలో 232 మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల నుంచి ప్రభుత్వ బడుల్లో చేరగా, దుండిగల్ మండలంలో 288, బాచుపల్లిలో 197, కుత్బుల్లాపూర్‌లో 448, కూకట్‌పల్లిలో 501,

◆ బాలానగర్‌లో 215, అల్వాల్‌లో 285, మల్కాజిగిరిలో 273, ఉప్పల్‌లో 694, మేడిపల్లిలో 140, కాప్రాలో 461, శామీర్‌పేటలో 141, కీసరలో 327, ఘట్‌కేసర్‌లో 439, మూడుచింతలపల్లిలో 50 విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల నుంచి ప్రభుత్వ స్కూళ్లలో చేరారు.